క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతుల బొనాంజా

చైతన్యపురి: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు లాటరీ ద్వారా బహుమతులు అందజేయనున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 18 నుంచి 30వ తేదీ మధ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు తమ టికెట్ల వెనుక పేరు, సెల్ నంబర్ రాసి బస్‌స్టాండ్‌ల్లో ఉన్న గిఫ్ట్ బాక్స్‌ల్లో వేయాలన్నారు. డ్రా ద్వారా 110 మంది ప్రయాణికులకు ఒక్కొక్కరికి రూ. 9,900 చొప్పున బహుమతిగా ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

కనుల పండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


స్వామివారి తిరువీధి ఉత్సవం

వనస్థలిపురం: సచివాలయనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 3వ రోజు మంగళవారం ఉత్సవ మూర్తులకు అభిషేకం, మన్యు సూక్త హోమం, సింహ వాహనంపై తిరువీధి ఉత్సవం, శ్రీవారి కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ, మూలమంత్ర హోమం, బ్రహ్మశ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తిచే పాదుకా పట్టాభిషేకం ప్రవచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్ జగదీశ్‌కుమార్, కోశాధికారి శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యులకు ఐవీఎఫ్ అండ

నాగోలు: పేదలకు నిరంతరం చేయుతనందిస్తామని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర (ఐవీఎఫ్) అధ్యక్షుడు, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోలు డివిజన్‌కు చెందిన పేద ఆర్యవైశ్యుడైన ఆటో డ్రైవర్ శేఖర్‌కు కుటుంబ అవసరాల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ గుప్తా అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నాగోల్ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ గోరంట్ల నవీన్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడిగా అమరేందర్‌రెడ్డి

హస్తినాపురం: డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీ ఫేజ్–1 సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కాలనీ వాసులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీరం అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చిట్టె సతీష్‌కుమార్, కోశాధికారిగా చంద కోటేశ్వర్, ఉపాధ్యక్షుడిగా పన్నాల జంగయ్య, ఏడుకొండలు, బుగ్గ రాములు, సాంస్కృతిక కార్యదర్శులుగా పి.విశ్వేశ్వర్, టి.మధుసూదన్‌రెడ్డి, పి.రాజేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బి.తరుణ్‌కుమార్, బి.జీవన్, కార్యవర్గ సభ్యులుగా ఎం.శ్రీనివాసాచారి, ఎ.శ్రీశైలం, హెచ్.ఆనంద్ ఎన్నికయ్యారు.

పూల పండుగ తెలంగాణాకు మాత్రమే సొంతం


సందడిగా బతుకమ్మ ఆడిన ఎస్‌వీవీ హైస్కూల్ విద్యార్థులు

సైదాబాద్: పూలను పూజించే ప్రత్యేక సాంప్రదాయం బతుకమ్మ ద్వారా తెలంగాణాకు మాత్రమే సొంతమని శ్రీ విజ్ఞాన వర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. సైదాబాద్ డివిజన్ మాతృశ్రీ కాలనీలోని పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ ఆడి పాడారు. విద్యార్థుల దాండియా ఆటపాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, మిస్ తెలంగాణ గ్రహీత ఊర్మిళా చౌహాన్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణ జరపాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సగర, ఉప్పర సంఘంలో నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణ జరిపించాలని ఆ సంఘం నేత నీరడి భూపేష్‌సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీబీఐ అధికారులకు నిధుల దుర్వినియోగంపై ఆయన లేఖను అందజేశారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. గత మూడున్నర ఏళ్ల నుంచి జనగణన, దాతల ద్వారా స్వీకరించిన దాదాపు రూ.3 కోట్ల నిధుల దుర్వినియోగమయ్యాయని, ఈ విషయంలో విచారణ జరిపించాలని కోరారు.

అంతటా ఆధ్యాత్మిక శోభ


మాతామైదాన్‌లో అమ్మవారికి పల్లకీసేవ


అమ్మవారిని దర్శించుకున్న ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్, విజయ్‌కుమార్ తదితరులు

సైదాబాద్: దేవీశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయాల్లో రోజుకొక ప్రత్యేక అలంకరణలో కొలువుదీరుతున్న అమ్మవారిని భక్తులు దర్శించుకొని భక్తి పారవశ్యంలో తన్మయత్వం చెందుతున్నారు. ఉత్సవాల్లో 3వ రోజు సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గా మాత అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ అధికారి విజయ్‌కుమార్‌లు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించారు. జీవన్‌జ్యోతి సంఘంలోని జయదుర్గా మాత అన్నపూర్ణాదేవి అలంకరణలో కొలువుదీరారు. ఆలయానికి భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



బాబా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో 105వ మహాసమాధి ఉత్సవాలు, శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసువర్ణ పుష్పార్చన, చండీ హోమం నిర్వహించారు. భక్తులు శ్రీసాయి లక్ష నామార్చన చేశారు. మహిళలు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య దంపతులు, వైస్ చైర్మన్ శ్యామ్‌కుమార్, ఆర్ఎస్ శంకర్‌రావు దంపతులు, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


అన్నపూర్ణాదేవి అలంకరణలో కొలువుదీరిన జయదుర్గా మాత


దిల్‌సుఖ్‌నగర్ సాయి ఆలయంలో చండీహోమం


బైరామల్‌గూడలోని అమ్మవారి మండపంలో భక్తులు పూజలు


మన్సూరాబాద్ పోచమ్మ గుడిలో మహిళల సామూహిక కుంకుమార్చన

వర్క్‌షాపులతో వైద్యుల నైపుణ్యాల మెరుగు


కేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్న వైద్యులు

చాదర్‌ఘాట్: మెదడుకు సంబంధించిన రోగులతో పాటు వ్యాధి సంక్లిష్టత పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో వైద్యులు కూడా మైక్రో సర్జికల్ శస్త్రచికిత్సల్లో నైపుణ్యాలు పెంచుకోవాలని డాక్టర్ శివానందరెడ్డి అన్నారు. మంగళవారం మలక్‌పేట కేర్ ఆసుపత్రిలో మైక్రో వాస్కులర్ సర్జరీ నైపుణ్యాల శిక్షణపై వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపులో దేశంలోని పలు ప్రాంతాల నుంచి 25 మంది వైద్య ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానందరెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి వర్క్‌షాపులతో వైద్యులు సర్జరీ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. వివిధ శస్త్రచికిత్సల్లో మైక్రో సర్జికల్స్‌లో అనుభవం పెంచుకోవడం ముఖ్యమన్నారు. శస్త్రచికిత్సలు చేసే వైద్యులకు శరీర నిర్మాణ శాస్త్రంపై లోతైన అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో న్యూరో సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రూపేష్‌కుమార్, ఒమేగా హాస్పిటల్ న్యూరోసర్జన్ టి.నరసింహారావు, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ అరుణ్ పాల్గొన్నారు.


ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష స్పందన


మేళాలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న దుస్తులు, ఇతర ఉత్పత్తులు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన లభిస్తోంది. దసరా పండుగ సందర్భంగా మేళాలో కొలువైన దుస్తులు, చీరలు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ, గంగాధర్ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని వారు తెలిపారు.

పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలి


ఏఐవైఎఫ్ డిమాండ్


ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న షేక్ మహమూద్ తదితరులు

సైదాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐవైఫ్ తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 29, 30 తేదీల్లో హిమాయత్‌నగర్ తేరావంత్ భవన్‌లో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను రూపొందించి అమలు చేయాలని ఈ మహాసభల ద్వారా ఏఐవైఎఫ్ సమర శంఖం పూరించనుందన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం, సమగ్ర యువజన విధానం కోసం, విద్య వైద్య వ్యాపారం రద్దు కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వర్ధ్య, దశరథ్ నాయక్, గోపాల్ నాయక్, చరణ్, సతీష్, నితిన్, సమీర్, శివ, ఉమేద్, నవ, బాలాజీ, అరవింద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చీకట్లో బతుకమ్మ ఉత్సవాలు !

మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: బతుకమ్మ ఉత్సవాలను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన కుర్మగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, అధికారుల తీరు వల్ల ఈసారి మహిళలు బతుకమ్మ ఉత్సవాలు చీకట్లో జరుపుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. జంటనగరాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున దుర్గామాత మండపాల వద్ద, బస్తీ మైదానంలో బతుకమ్మ ఆడతారని, ఈ సందర్భంగా ప్రతిసారీ తాత్కాలిక లైటింగ్ ఏర్పాటు చేసే జీహెచ్ఎంసీ, స్ట్రీట్ లైట్ విభాగం ఈ సారి ఏర్పాటు చేయలేదని అన్నారు. అధికారులు తీరు వల్ల చీకట్లో బతుకమ్మ ఆడేందుకు మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు కడారి రాము, బండ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 15, వంకాయ 35, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 26, బీర 18, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, కారెట్ 33. దొండ 23, ఆలు 21, ఉల్లి 29, గోకర 28, దోస 13, సొర 13, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 65, అర్వి 38, మునగ 75, చిలగడదుంప 55, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 55.

నేడు రైతుబజార్‌కు సెలవు..

● సరూర్‌నగర్ రైతుబజార్‌కు నేడు సెలవు ఉందని రైతుబజార్ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతీ నెల 3వ బుధవారం సెలవు ఉన్నందున ఈరోజు రైతు బజార్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని ఆమె స్పష్టం చేశారు. గురువారం యథావిధిగా రైతుబజార్‌లో అమ్మకాలు, కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న ఎమ్మెల్యే: సామ


కృష్ణమ నాయుడుకు బీజేపీ కండువా కప్పుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనేక అక్రమ పద్ధతులు అవలంభిస్తున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. మన్సూరాబాద్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీలోని మారం అపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కృష్ణమ నాయుడు తన అనుచరులతో కలిసి మంగళవారం బీజేపీలో చేరారు. ఎల్‌బీనగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సమక్షంలో కృష్ణమ నాయుడుకు ఆయన బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, నారాయణ, శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్న ఎల్‌బీనగర్ ఓటర్ల నెంబర్లు సేకరించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి ట్యూషన్ ఫీజులో 30 శాతం తగ్గింపజేస్తామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రలోభాలకు గురిచేస్తున్నాడన్నారు. అంతేకాకుండా ఓటర్లకు గిఫ్ట్ ప్యాక్‌లు పంపిణీ చేస్తున్నాడని, ఈ విషయంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని మండిపడ్డారు. పార్టీలో చేరిన వారిలో శివాజీ నాయుడు, లోకేష్, రోహన్, వసీం, ఇంద్ర, భరత్, దిలీప్‌రెడ్డి, చరణ్, విఘ్నేశ్వర నాయుడు, అశ్విన్, అశ్విక్‌లతో పాటు 100 మంది ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు, కొత్త రవీందర్‌గౌడ్, నాంపల్లి రామేశ్వర్, ఎంజాల జగన్, కవితారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రవినాయుడు, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష

మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపించాలి: మంత్రి సబితారెడ్డి

జంగ్ 2023 తెలంగాణ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలంటే మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గెలిపించాలని, ఆయన నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆధ్వర్యంలో డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, గతంలో ఎల్‌బీనగర్ ప్రాంతం ఎలా ఉండేది, ఇపుడు ఎలా మారిందనేది చూడాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, కొత్తపేటలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, పెద్ద ఎత్తున జూనియర్, డిగ్రీ, లా కళాశాలల ఏర్పాటు, 20 బస్తీ దవాఖానాలు రూ.14 కోట్లతో కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో 5 వేల డబుల్ బెడ్ రూమ్‌లు కడితే, వాటిలో 1500 ఇళ్లు సరూర్ నగర్, ఆర్‌కే పురం డివిజన్లలోని పేదలకు దక్కాయని, మరో 500 స్థానిక కోటా కింద వచ్చాయన్నారు. మిగతా 3 వేలు పక్క నియోజకవర్గ ప్రజలకు డ్రా ద్వారా కేటాయిస్తే ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా బీజేపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణలో అభివృద్ధి లేదని అంటున్న రాజ్‌నాథ్ సింఘ్‌కు గచ్చిబౌలి నుంచి మహేశ్వరానికి వస్తూ విదేశాలకు దీటుగా తయారైన తీరును చూసి ఆశ్చర్యం వేసిందన్నారు. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు కేంద్రం పైసా ఇవ్వకున్నా నిర్మించింది కనిపించడం లేదా అని అన్నారు. తెలంగాణాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని, తెలంగాణాలో ఇస్తున్నట్టు పెన్షన్లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అరవింద్ శర్మ , డివిజన్ పార్టీ అధ్యక్షుడు నగేష్, నాయకులు రాంనరసింహ గౌడ్, సీనియర్ నాయకులు సాజిద్, దుబ్బాక శేఖర్, కొండల్ రెడ్డి, సునీతా రెడ్డి,మీనా, పద్మారెడ్డి, గొడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగింది: ఎమ్మెల్యే


బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ ప్రాంతంలోని సీతారామనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. కాలనీకి చెందిన కరాటే యాదమ్మ ఆధ్వర్యంలో పలువురు మహిళలు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సుధీర్‌రెడ్డి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. ఎల్‌బీనగర్‌లో ఇప్పటికే మొదటి దఫా గడప గడపకూ ఎన్నికల ప్రచారం పూర్తైందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లా రఘుమారెడ్డి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, రాజిరెడ్డి, రోజారెడ్డి, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, సత్యప్రకాష్, శేఖర్‌రెడ్డి, జగదీష్ గౌడ్, వసంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులను ఆదుకుంటా

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌కు చెందిన నాయీ బ్రాహ్మణులను సొంత అన్నదమ్ములు, బిడ్డలు మాదిరిగా చూసుకుంటున్నానని, భవిష్యత్‌లో అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మతం, కులం పేరుతో వచ్చే వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గడల రాజు, నాయకులు జంపాల వెంకటేష్, నర్సింగ్, మహేష్, మంకాల సుధాకర్, మావిడాల రవికుమార్, రవి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ప్రచారం

మన్సూరాబాద్: నిత్యం ప్రజల మధ్యే ఉంటూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించుకోవాల్సిన బాధ్యత ఉందని ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక నాయకులు తూర్పాటి చిరంజీవి, ఆడాల రమేష్ పిలుపునిచ్చారు. మన్సూరాబాద్ వీకర్ సెక్షన్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో చంగల్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఇంటింటి ప్రచారం చేశారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న ఇంటర్‌స్కూల్ వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. 155కు పైగా పాఠశాలల నుంచి 2500 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. బాలుర విభాగంలో హిల్ స్కూల్ గోల్డ్ మొదటి స్థానంలో నిలవగా, నెల్లూరులోని అక్షర విద్యాలయం, కడ్తాలకు చెందిన బటర్‌ఫ్లై రెండో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో సెయింట్ జాన్స్ స్కూల్, మొదటి స్థానంలో నిలవగా, హైదరాబాద్‌లోని డీపీవీ స్కూల్, కొల్లూరులోని సమిష్టి ఇంటర్నేషనల్ స్కూల్ వరంగల్ పబ్లిక్ స్కూల్‌లు విజేతలుగా నిలిచాయి.

ఎప్పటికి తీరేను ఈ బాధ?

- గార్బేజీ కాంట్రాక్టర్‌కు నెలకు రూ. 3 లక్షల చెల్లింపు
- ఎక్కడిచెత్త అక్కడే
- మురుగు పరుగు
- ఇదీ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లోని పరిస్థితి


మార్కెట్‌లో కుప్పలుగా పేరుకుపోయిన చెత్త


వరదలా పారుతున్న డ్రైనేజీ

చాదర్‌ఘాట్: కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని చెప్పుకునే మార్కెట్ కమిటీకి మార్కెట్‌లో డ్రైనేజీ, చెత్తకుప్పలు కనపడటం లేదా అని పలువురు రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వ్యాపార కార్యకలాపాలతో నిగనిగలాడాల్సిన మార్కెట్ నిత్యం మురుగునీరు, చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. గార్బేజీ కాంట్రాక్టర్‌కు నెలకు రూ.3 లక్షలు చెల్లిస్తున్నప్పటికీ ఎక్కడి చెత్త అక్కడే ఉండి ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. గతంలో టెండర్ ద్వారా కాంట్రాక్ట్ పనులు అప్పగించినప్పటికీ పనులు సరిగ్గా చేయడం లేదని కాంట్రాక్టర్ రద్దు చేసి, టెండర్ లేకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే అతను కూడా ఇష్టారీతిగా పనులు చేస్తున్నాడని పలువురు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గార్బేజీ సమస్యపై మార్కెట్ కమిటీ గానీ, అధికారులు గానీ స్పందించక పోవడం కొసమెరుపు.